



# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

గురువారం 13 ఆగష్టు 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2





## దోసపాడు నుండి మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

**-ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

భానుపురి/సూర్యాపేట టౌన్

దోసపాడు నుండి సూర్యాపేటకు మంచినీటి సరఫరా పునరుద్ధరణ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. బుధవారం 40 వ వార్డులో 5 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నాలుగు కల్వర్టుల నిర్మాణ నికి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో మంచినీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మిషన్ భగీర ద్వారా వచ్చే నీటి సరఫరా పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా పట్టణంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయవలసిందిగా జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు.



ఇటీవల నాగార్జునసాగర్ వరుణ యాగం సందర్భంగా ముఖ్యమంత్రిని కలిశామని ఆయన అన్నారు. 60 ఫీట్ల రోడ్ అండర్ పాస్ సమస్య పరిష్కారానికి హైవే అధికారులతో మాట్లాడుతున్నామని చెప్పారు. పట్టణంలో అన్ని వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు కొణతం రాజేష్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,తంగెళ్ల కరుణాకర్ రెడ్డి , నరేందర్ నాయుడు, ఆలేటి మాణిక్యం, మద్దెబోయిన శ్రీనివాస్, నరేష్ పిల్లై ,వంశి, వెంకన్న, సంజయ్, వార్డు జవాను శ్రవణ్, వార్డు ఆఫీసరు సత్య తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ రాజయ్య కు వీడ్కోలు

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం



జిల్లా పోలీస్ భరోసా సెంటర్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న రాజయ్య బుధవారం రోజున ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ రాజయ్య దంపతులను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, పోలీసు శాఖలో సుదీర్ఘంగా 32 సంవత్సరాల పాటు పని చేసి ప్రజలకు సేవలు అందించి, ప్రజల మన్ననలు పొందిన రాజయ్య సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం అభినందనీయమన్నారు. శేష జీవితాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా, ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.ఈ వేడుకలో హోంగార్డు ఇంచార్జీ రిజర్వ్ ఇన్స్పెక్టర్ నారాయణరాజు, ఆర్ఎస్ఐ అశోక్, రాజయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పోలీస్ సిబ్బంది పాల్గొని రాజయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దేశభక్తి పెంపొందించుటకు తిరంగా ర్యాలీ

భానుపురి /సూర్యాపేట టౌన్



స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో200 మీటర్ల తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి, ఆత్మనిర్భరత, జాతీయ ఐక్యత దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. మోదీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపు దేశ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని మరింతగా పెంపొందిస్తోందని పేర్కొన్నారు.భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటడం అభినందనీయమని పేర్కొన్నారు.దేశభక్తి నినాదాలైన “భారత్ మాతాకీ జై”, “వందే మాతరం”, “జై హింద్” నినాదాలతో తిరంగా ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, దేశ అభివృద్ధి జాతీయ సమైక్యత కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన ఈ ర్యాలీలో పట్టణ అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్, జిల్లా పార్టీ నాయకులు, పట్టణ నాయకులు, పట్టణ కార్యకర్తలు,జిల్లా మోర్చాలు,, మండల అధ్యక్షులు, మండల నాయకులు, బీజేపీ విభాగాల పదాధికారులతో పాటు, పట్టణ విద్యార్థులు,పట్టణ యువత పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత కంటి వైద్యం అందించడం అభినందనీయం





**-40వ వార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం**

భానుపురి/సూర్యాపేట టౌన్

పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 40 వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి సమస్యలకు సరైన సమయంలో చికిత్స పొందలేకపోతున్నారని అన్నారు. అలాంటి వారికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాలని సూచించారు. కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కంటి సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.శిబిరంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించు కున్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్‌రెడ్డి, నాగుల వాసు, చిలుముల సునీల్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, కాంగ్రెస్ నాయకులు మద్దేబోయిన శ్రీనివాస్, 13వ వార్డు కాంగ్రెస్ నాయకులు భూక్యా మహేష్, నరేష్ పిల్లే, వంశీ, వెంకన్న, రాజబాబు, సంపత్, సాయి, సంజయ్, శ్రీను, బషీర్, సైదాబీ, రఫీ, కరుణాకర్, ప్రతాప్, రమేష్, వార్డు జవాన్ శ్రావణ్, వార్డు ఆఫీసర్ సత్య, వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సిబ్బంది జనార్ధన చారి, శంకర్, నిప్పి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ కాలనీ జి ప్లస్ వన్ ఇండ్ల పనుల్లో స్పీడు పెంచాలి





భానుపురి/హుజూర్ నగర్

హుజుర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజుర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

**-ప్రతి బ్లాక్‌లో ఇన్స్పెక్షన్లు..**

ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, వాటి జాబితాను సిద్ధం చేయాలని సూచిం చారు. ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**-తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతం**

ఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు.

**-1,805 మందితో తాత్కాలిక జాబితా**

ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ప్రాథమికంగా 1,805 మంది అర్హులైన లబ్ధిదారులతో జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ప్రత్యేక బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలి స్తున్నామని తెలిపారు. అర్హత లేని వారి పేర్లు ఉంటే తొలగిస్తామని, నిజమైన పేదలకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు పిడి హౌసింగ్ జబ్బర్ హేహ్మద్, తహసిల్దార్ కవిత మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, గుత్తేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

భానుపురి/సూర్యాపేట టౌన్



ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ – యుఎస్‌పిసి సూర్యాపేట మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న డిఎ, పిఆర్‌సి బకాయిలు, ఉద్యోగోన్నతులు, బదిలీలు, పదోన్నతుల కల్పన, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో తీవ్రంగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని, విద్యారంగానికి తగిన బడ్జెట్ కేటాయింపులు చేయాలని, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాన్ని నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో యుఎస్‌పిసి ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు.డిపిఎఫ్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్వాయి బిక్షం, టిపిటిఎఫ్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న, డిఎస్‌యుటిఎఫ్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి రమేష్, టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సిరగాని యాకయ్య, డిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ మన్నూరి నాగన్న ఆనంద్, రాఘవులు, పోతురాజు నరసయ్య, సైదా నాయక్, వీరారెడ్డితదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ కుటుంబానికి ఆర్థిక సహాయం



భానుపురి సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడైనటువంటి ఆదిమల్ల రవికుమార్ అకాల మరణం చెందడం జరిగింది. వారి కుటుంబానికి ఆర్థిక భరోసాని కల్పిస్తూ అండగా సూర్యాపేట జిల్లాలోని వికలాంగుల మిత్రబృందం సహకారంతో జిల్లాలో ఉన్నటువంటి దివ్యాంగులు అందరూ కలిసి 40 వేల రూపాయల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో షేక్. నయీమ్.కొరివి సైదులు. బెంగారపు బిక్షపతి. వీరమల్ల యాదగిరి. కర్నాటి జయకృష్ణ. నల్లెడ మాధవరెడ్డి. యుద్ధ సైదులు. ఏలే జానయ్య. సీఎం సైదులు. ఉప్పేనపల్లి సైదులు. ఎరుకల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూమిలో అనుమానస్పద స్థితిలో భార్యభర్తల మృతదేహాలు లభ్యం





భానుపురి/మోతె

మోతే మండల కేంద్రము సమీపంలో జాతీయ రహదారి వెంట కాళ్ళు చేతులు కనిపించేలా భూమిలో పాక్షికంగా పాతిపెట్టిన మగ, ఆడ మృతదేహాలను పోలీసులు వెలికి తీశారు. సంఘటనా స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ భూమిలో పాక్షికంగా పాతిపెట్టిన మృతదేహాలకు సంభందించిన సమాచారాన్ని స్థానిక ప్రజలు సంచారం ఇవ్వగానే డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సిఐ రామకృషా రెడ్డి, స్థానిక ఎస్ఐ, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతి దేహాలను వెలికితీయడం జరిగినది. మృతులు బీక్యాతండా కు చెందిన బూబా, నాగు గా గుర్తించడం

## రైతు పొలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

ఒకే రకం పంట వేసి నష్టపోకుండా విభిన్న రకాల పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతును జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక రైతు పాశం వెంకటరెడ్డి పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న పంటల వివరాలను, అనుసరిస్తున్న పద్ధతులను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంకటరెడ్డి తనకున్న రెండు ఎకరాల భూమిలో ఒకే రకం పంటపై ఆధారపడకుండా బీర, మిర్చి, బంతి, బెండ, దోస వంటి ఆరు రకాల పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి తగ్గట్లుగా విభిన్న సాగు పంట దిగుబడి, మార్కెటింగ్ వివరాలను రైతు కలెక్టర్‌కు వివరించారు. 30 గుంటల్లో వేసిన మిర్చి పంట ద్వారా దాదాపు 10 టన్నులు, బీర ద్వారా 4 టన్నులు, బంతి పూల ద్వారా టన్నున్నర నుంచి 2 టన్నులు, అలాగే బెండ, దోస సాగు ద్వారా మరో టన్ను వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకే పంట వేసి నష్టపోయే కంటే, ఇలా విభిన్న పంటలు వేయడం ద్వారా నిరంతరం ఆదాయం పొందవచ్చని వెల్లడించారు. రైతు ఆదర్శవంతమైన సాగు పద్ధతులను కలెక్టర్ అభినందించారు.అదేవిధంగా శ్రీనివాస్ పురం గ్రామానికి చెందిన పారుపల్లి



శ్రీనివాసరావు (శ్రీ శ్రీ) సంపూర్ణ సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న ఐదు ఎకరాల డ్రాగన్ తోటను కూడా పరిశీలించారు. రైతుతో మాట్లాడి పంట దిగుబడి అంతర్గత పంటల గురించి తెలుసుకున్నారు. అంతర్గత పంటలు వేయడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని కలెక్టర్ రైతుకు సూచించారు. దీంతోపాటు గట్ల వెంట వివిధ రకాల చెట్లను నాటి వాటి ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఏడి ఏ రవి, ఎంఏఓ స్వర్ణ, తహసిల్దార్ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ లైబ్రరీకి ఐదు లక్షల మంజూరు



భానుపురి /హుజూర్ నగర్

పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయం త్వరలోనే కొత్త హంగులు సంతరించు కోనుంది. బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయంలోని వసతులను పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థులు, నిరుద్యోగుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 5 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. పుస్తకాల లభ్యత, తాగునీరు, ఫర్నిచర్, వెలుతురు వంటి సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యకు అనుగుణంగా వసతులు పెంచాలని సూచించారు.మౌలిక వసతులకు రూ. 5 లక్షలు లైబ్రరీలో సివిల్ వర్క్స్, పెయింటింగ్, అదనపు కుర్చీలు, టేబుళ్లు, తాగునీటి సౌకర్యం కోసం రూ. 5 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నిధులతో వెంటనే పనులు చేపట్టి, గ్రంథాలయాన్ని పాఠకులకు మరింత చేరువ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించాలని కోరారు.కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివా సులు, వ్యవసాయ శాఖ ఏడిఏ రవి, తహసిల్దార్ కవిత, గ్రంథాలయ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి బోనాలకు రండి



భానుపురి/ సూర్యాపేట కల్చరల్

ఈ నెల 16న 16 వార్డులో గల బెంచీరాగ్ మాధారం శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగకు ఆహ్వానం పలుకుతూ కమిటీ సభ్యులు బుధవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో ఏఐసీసీ నాయకులు రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డిని దేవాలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.దఅనంతరం పట్టణ సీఐ వెంకటయ్య స్థానిక కౌన్సిలర్లతో కలిసి బోనాల పండుగ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం లో యువకుడికి తీవ్ర గాయాలు



భానుపురి/మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప మల్లన్నగుట్ట సమీపంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం లో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో పాలడుగు గ్రామానికి చెందిన బొంత అనిల్ (25) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం అనిల్ పల్సర్ బైక్ పై కొండగడప నుంచి పాలడుగు గ్రామానికి వెళ్తుండగా, మోత్కూరు వైపు నుంచి అడ్డగూడూరు వైపు వెళుతున్న అశోక్ లేలాండ్ వాహనం ఎదురె దురుగా ఢీకొన్నాయి. దీంతో అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి, గాయపడ్డ యువకుడిని 108 లో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పటి సినిమా టాకీస్ ల తీరే వేరయా

భానుపురి/సూర్యాపేట టౌన్

ఒకప్పుడు సినిమా చూడటం అంటే... ఈ రోజుల్లోలా ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకుని, ఏసీలో హాయిగా కూర్చొని సినిమా చూడటం కాదు. అదో యుద్ధం... అదో పండుగ... అదో మధురమైన అనుభవం. అప్పట్లో టికెట్ ధరలు కూడా భలేగా ఉండేవి. నేల – – 60 పైసలు, బెంచి -- ఒక రూపాయి, కుర్చీ -- రూపాయి పావలా. నిజానికి సినిమా చూడ్డానికి టికెట్ దొరకడం గొప్ప కాదు... లోపల కూర్చోడానికి చోటు దొరకడం అసలైన విజయం. థియేటర్ యాజమాన్యానికి ఒకటే సూత్రం. “టికెట్లు అమ్ముతూనే ఉండాలి!” నేలంతా నిండిపోయి, ఒకరి భుజాలపై ఇంకొకరు కూర్చున్నా బుకింగ్ ఆగకూడదు. లోపల తోపులాటలు, అరుపులు, చిన్నపాటి యుద్ధాలు జరిగినా గేట్‌కీపర్ మాత్రం ఏమాత్రం కదిలేవాడు కాదు. అలా టిక్కట్లు కట్ చేస్తూనే ఉండేవాడు. నేల క్లాస్‌లో అయితే కూర్చోడానికి చోటు దొరకక కొందరు తెర ముందు ఉన్న అరుగు మీదే కూర్చుని, కొండంత పెద్దగా కనిపించే హీరో, హీరోయిన్ ల ముఖాల్ని చూస్తూ సినిమా చూసేవారు. సినిమా మొదలయ్యేలోపు ఆడవారి మధ్య జరిగే మాటల యుద్ధాలు, జుట్టు పట్టుకుని కింద పడేసే సంఘటనలు కూడా ఆ రోజుల్లో మాములే ! సినిమా మొదలైతే మరో లోకం మొదలయ్యేది. హీరో తెరపైకి వచ్చి కత్తి తిప్పితే చాలు ఈలలే ఈలాలు ... ఇక హీరోయిన్ తో పాట మొదలైతే .. వాళ్ళే హీరోల్లా కలలు కనేవారు
అంతలోనే...

“సోడా...గోళీ సోడా...”

“చాయ్ ...కాఫీ “

“జంతికలు ..చెగోడీలు “

“శనగలు..వేడి శనక్కాయలు .”

అంటూ రాగాలాపన చేస్తూ అమ్మేవాళ్ళ గోల. కీచ్చ్ మనె గోళీ సోడా శబ్దం... తుప్పుపట్టిన పావుతో శనగలు కొలిచే తీరు...వీళ్ళ మధ్య పొగరాయుళ్ళు గుప్పు గుప్పుమని పీల్చి వదిలే ఘాటైన దూమపాన వాసనలు ... ఇవన్నీ సినిమాకంటే తక్కువ వినోదం కాదు! అయితే అసలు హీరోలు మరోటి ఉండేవి ... అవే బెంచీల్లో రాజ్యమేలే నల్లులు. ప్రేక్షకులు కూర్చోగానే కుటుంబ సమేతంగా వచ్చి దాడి చేసేవి. వాటి కాట్లకు, దురద భరించలేక గోక్కుంటుంటే వెనక నుంచి “కూచో... తెర కనిపించడం లేదు!” అనే అరుపులు. కొంతమంది అనుభవజ్ఞులు మాత్రం అగ్గిపుల్ల గీసి బెంచి సందుల్లో తిప్పేవారు. దాంతో కొన్ని నల్లులు వీరమరణం పొందేవి. మిగిలినవి ప్రతీకార యాత్ర మొదలుపెట్టి మరింత గట్టిగా కుట్టేవి. అప్పుడు బెంచీలపై ప్రేక్షకుల డ్యాన్సులు చూస్తే సినిమాలో ఉన్న పాటలకంటే ఎక్కువ వినోదాన్ని కలిగించేవి. బాల్కనీకి వెళ్తే ఇంకో కథ. చిరిగిపోయిన కుర్చీల్లోంచి కొబ్బరి పీచు బయటకు తొంగిచూస్తూ ఉండేది. ఇక్కడ నల్లులు తక్కువే... కానీ మేకులు ఎక్కువ. లేచేటప్పుడు పేంటు గాని ,షర్ట్ గాని, చీర గాని చిరిగి “పర్ర్” మనే శబ్దం వినిపించేది. దెబ్బతో సినిమా చూసిన మజా అంతా పోయేది. ఇక ఫ్యాన్లు అయితే తమదైన స్టైల్‌లో తిరిగేవి. గాలి కంటే “గీక్... గీక్...” అనే శబ్దమే ఎక్కువ. అవి ఊడి తలపై పడకపోతే అదే అదృష్టంగా భావించేవారు. కొన్నిసార్లు మధ్యలో కరెంటు పోతే... థియేటర్ మొత్తం ఈలలతో మార్మోగేది. జనరేటర్లు లేని రోజులు... కరెంటు వస్తే సినిమా... రాకపోతే పాస్ ఇచ్చి ‘రేపు రండి” అనేవారు. మరుసటి రోజుఅదే ఉత్సాహంతో మళ్లీ



వచ్చేవారు. ఏడాది తిరిగి తిరిగి ఊరికి వచ్చే పాత ప్రింట్లు... తెరంతా గీతలు... మధ్యలో ఫిల్మ్ తెగిపోవడం... అయినా ప్రేక్షకుల ఆనందం మాత్రం ఏమాత్రం తగ్గేది కాదు. ఈ రోజుల్లో రిక్లైనర్ సీట్లు, డాల్బీ సౌండ్, ఏసీ, ఆన్‌లైన్ బుకింగ్, పాప్‌కార్న్... అన్నీ ఉన్నాయి. కానీ అప్పటి ఆ కేరింతలు... ఆ ఈలలు... ఆ తోపులాటలు... ఆ అమాయకపు ఆనందం మాత్రం కనిపించడం లేదు. సౌకర్యాలు పెరిగాయి... కానీ ఆ సరదాలు తగ్గిపోయాయి . ఎందుకంటే ఆనందం థియేటర్‌లో కాదు... అప్పటి మనుషుల మనసుల్లో ఉండేది. అందుకే...ఆ రోజుల్లో అదో అందమైన సినిమా ప్రపంచం... ..అదో చెప్పలేని ఆనందం... నిజంగానే అది ఓ గోల్డెన్ ఎరా!” ఇష్టమైన జ్ఞాపకాలు వయసు పెరిగే కొద్దీ మరింత మధురమవుతాయి. ఈ కథనం కూడా అలాంటి ఓ పాతకాలపు నవ్వుల ప్రయాణం.